# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ:  23-11-2024    సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా బోధనలు ప్రపంచ మానవాళికి అనుసరణీయమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.
- ❖ సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అర్హులైన రైతులకు అందించాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.
- ❖ యువ ఉత్సవ్ కార్యక్రమాలు యువతరానికి స్ఫూర్తిదాయకమని విజయవాడ పిఐబి అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి తెలిపారు.
- ❖ స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు.
- ❖ దక్షిణ బంగాళాఖాతంలో ఈ నెల 25వ తేదీన వాయుగుండం ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

======================

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చేపట్టిన సేవలు ప్రపంచ మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ఈ రోజు జరిగిన బాబా 99వ జయంతి వేడుకలలో ముఖ్యఅతిథిగా గవర్నర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... మానవసేవే మాధవ సేవ అని బాబా బోధించారని అన్నారు. సేవ తత్వం.. ప్రేమ తత్వం.. శ్రీ సత్యసాయి సూక్తులుగా గవర్నర్  పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

ఈ సందర్భంగా సత్య సాయి సమాధిని రాష్ట్ర గవర్నర్ సందర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సత్య కుమార్ యాదవ్, ఎస్. సవిత తదితరులు పాల్గొన్నారు.

=======================

యువతరానికి స్ఫూర్తిదాయకంగా యువ ఉత్సవ్ కార్యక్రమాలు ఉంటాయని విజయవాడ పిఐబి అడిషనల్ డైరెక్టర్ జనరల్ రాజిందర్ చౌదరి తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి "యువ ఉత్సవ్- 2024" కార్యక్రమం విజయవాడ నగరంలో ఈ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా హాజరైన రాజిందర్ చౌదరి మాట్లాడుతూ... కేంద్ర సమాచార ప్రసార శాఖ వచ్చే సంవత్సరం ఫిబ్రవరిలో నిర్వహించే వేవ్స్ సదస్సు గురించి అవగాహన కల్పించారు. ఈ సదస్సులో యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు. ఎన్టీఆర్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శుభమ్ నోక్వాల్ మాట్లాడుతూ... జీవితంలో ఎదురయ్యే గెలుపోటములను సమానంగా స్వీకరించాలని యువతకు ఉద్బోధించారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి సుంకర రాము జిల్లా అధికారులు ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఈ కార్యకర్రమంలో పాల్గొన్నారు.

=======================

సబ్సిడీ ఎరువులు, విత్తనాలు అర్హులైన రైతులకు అందాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ రోజు నిర్వహించారు. పలువురు శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు పాల్గొన్న ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా కేంద్రమంత్రి హాజరయ్యారు. జిల్లాలోని సమస్యల మీద ఆయన సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో పత్తి రైతులకు రుణాలు, ఇ-క్రాప్ రిజిస్ట్రేషన్ వంటి పలు అంశాలపై సమవేశంలో చర్చించామని తెలియచేస్తూ...

(వాయిస్ 23 సెకన్లు)

విరామం

=======================

స్థానిక సంస్థల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. నెల్లూరులో ఈ రోజు జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామనారాయణరెడ్డి మాట్లాడుతూ... స్థానిక సంస్థలకు ప్రభుత్వం నేరుగా నిధులను అందజేస్తుందన్నారు. కాలుష్య నివారణకు గ్రీన్ ఎనర్జీకి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందని తెలిపారు. గ్రామస్థాయిలో సోలార్ విద్యుత్ తో పాటు గ్రీన్ ఎనర్జీపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు. ప్రజలలో అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

=======================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన ఖరారయ్యిందని బాపట్ల జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. డిసెంబర్ 7వ తేదీన ముఖ్యమంత్రి తొలిసారిగా బాపట్ల జిల్లాకు వస్తున్నారని అధికారిక సమాచారం అందిందన్నారు. బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగే "మెగా పేరెంట్ టీచర్ మీటింగ్" లో అయన పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు. కాగా, ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో బాపట్ల పట్టణంలోని మునిసిపల్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని జిల్లా కలెక్టర్ వెంకట మురళి, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ కలిసి ఈ రోజు పరిశీలించారు.

=======================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం దక్షిణ బంగాళాఖాతంలోని మధ్య భాగాలపై ఈ నెల 25వ తేదీన వాయుగుండంగా ఏర్పడే అవకాశం ఉందని అమరావతిలోని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆ వివరాలను వాతావరణ అధికారిణి వెల్లడిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

=======================

పేద ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఆరోగ్య భద్రత కల్పిస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బాధితులకు ఆయన అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ లేని ఆసుపత్రులలో వైద్యం చేసుకోవడంతో ఆర్థికంగా నష్టపోతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం అందచేస్తున్నామని మంత్రి తెలిపారు. పేద ప్రజలు డబ్బులు లేక వైద్యనికి దూరం కాకూడదని భావించి అన్ని రకాల రోగాలను ఆరోగ్యశ్రీలో ప్రభుత్వం పొందుపరచినట్లుగా ఆయన గుర్తు చేశారు.

=======================

"పల్లె పండుగ" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో డ్వామా, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో పల్లె పండుగలో చేపట్టిన పనులపై సమీక్ష చేశారు. పల్లె పండుగ కార్యక్రమంలో మొదలు పెట్టని పనులను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

=======================

ఫీజులు చెల్లించలేదనే కారణంతో విద్యార్థులకు హాల్ టిక్కెట్లు నిరాకరించడం, తరగతులకు హాజరుకాకుండా అడ్డుకోవడం వంటి చర్యలకు పాల్పడే ప్రైవేటు కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని విజయనగరం జిల్లా కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ హెచ్చరించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల ప్రిన్సిపాల్‌లు, యాజమాన్య ప్రతినిధులతో కలెక్టర్ ఛాంబర్‌లో ఈ రోజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తీసుకువచ్చే చర్యలు చేపట్టరాదని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం నేరుగా కళాశాలల బ్యాంకు ఖాతాలకే జమ చేయనుందని చెప్పారు.

=======================

మహారాష్ట్రలో ఎన్డీయే విజయం సాధించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు అపూర్వ విజయం కట్టబెట్టారని వ్యాఖ్యానించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ లకూ చంద్రబాబు ఫోన్ చేసి అభినందించారు.

=======================
=======================